క్లుప్తంగా

స్పాట్ అడ్మిషన్లు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలికల కళాశాల్లో ఈనెల 29న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రత్న కుమారి తెలిపారు. సీఈసీలో 7 సీట్లు, ఎంపీసీలో 1సీటు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తి గల విద్యార్థులు టీసీ, బోనఫైడ్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో కళాశాలలో హాజరు కావాలన్నారు.

ముఖరా(కె)ను సందర్శించిన విద్యార్థులు

ఇచ్చోడ: మండలంలోని ముఖరా(కె) గ్రామాన్ని వివేకానంద విద్యార్థులు ఆదివారం సందర్శించారు. సోలార్ విద్యుత్, నీటిశుద్ధికరణ, తడిచెత్త, పొడి చెత్త ద్వారా ఎరువుల తయారీ, ఇంకుడు గుంతలు, ఇంటింటా మురుగుదొడ్ల గురించి కరస్పాండెంట్ నిఖిని వర్మ వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ గాడ్గే మీనాక్షి, ఎంపీటీసీ గాడ్గే సుభాష్ పాల్గొన్నారు.

సిడాం వంశస్తుల ప్రత్యేక పూజలు

సిరికొండ: మండలంలోని రిమ్మ గ్రామంలోని సిడాం వంశస్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈనవ్వల్ పూజలో తొలిసారిగా పంట చేనులో పండిన పంట కూరగాయలతో కుల పెద్దలు తలుచుకుంటు గ్రామ సమీపంలోని జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పటేల్ శంకర్, సిడాం వంశస్తులు లాల్‌సాబ్, మారుతి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

బోథ్: మోడల్ స్కూల్‌లో హవర్లీ బేస్డ్ టీచర్స్ (హెచ్‌బీటీ) ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని బోథ్‌లోని మోడల్ స్కూల్ హెచ్‌బీటీ ఉపాధ్యాయులు కోరారు. ఆదివారం ఎంపీపీ తుల శ్రీనివాస్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు. టీజీటీలకు రూ. 42000, పీజీటీలకు రూ. 48000ల వేతనం అందించాలని కోరారు. రెగ్యులర్ ఉపాధ్యాయుల బదిలీ అనంతరం హెచ్‌బీటీలను ఖాళీగా ఉన్న పాఠశాలల్లో అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌బీటీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేతకాని మహార్లకు ప్రాధాన్యత ఇవ్వాలి

ఇంద్రవెల్లి: ఏజెన్సీ ప్రాంతంలోని నేతకాని మహార్లకు రాజకీయాల్లో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని నేతకాని మహార్ రాజకీయ చైతన్య యాత్ర ప్రోగ్రాం కన్వీనర్ కొత్తపల్లి గణేష్ అన్నారు. ఆదివారం మండలంలోని అమర వీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు సోన్‌కాంబ్లే మనోహర్ జెండా ఊపి యాత్ర ప్రారంభించారు. రాజకీయాల్లో నేతకాని మహార్లకు అన్యాయం జరుగుతుందన్నారు. ఇంద్రవెల్లి నుంచి ఏడు మండలాల్లో నేతకాని మహార్లను చైతన్యయాత్ర సాగుతుందన్నారు. కార్యక్రమంలో భారతీయ బౌద్ధ మహాసభ మండల కార్యదర్శి ఆనంద్‌రావ్, దిలీప్ మోరే, మస్కే రాజువర్దన్, లక్ష్మణ్, వావల్కర్ శివాజీ పాల్గొన్నారు.

కష్టపడి పనిచేసే ప్రతీ కార్యకర్తకు గుర్తింపు



మాట్లాడుతున్న అనిల్‌జాదవ్

నేరడిగొండ: పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందని బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో మాట్లాడారు. ప్రతీ కార్యకర్త పార్టీ బలోపేతం కృషి చేయాలన్నారు. అనంతరం సీఎం కేసీఆర్ బోథ్ నియోజకవర్గ టికెట్ కేటాయించడంతో అనిల్ జాదవ్‌ను పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు.

'సాజిద్‌ఖాన్‌కు టికెట్ కేటాయించాలి'

బోథ్: ఆదిలాబాద్ కాంగ్రెస్ అసెంబ్లీ సీటు డీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సాజిద్‌ఖాన్‌కు కేటాయించాలని మైనారిటీ నాయకులు కోరారు. ఆదివారం బోథ్ మండల కేంద్రంలో సమావేశం నిర్వహించారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేశారని గుర్తుచేశారు. కరోనా సమయంలో ఎంతో మందికి సహాయం చేశారని తెలిపారు. కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్, ఎంపీటీసీ రజియా బేగం, షేక్ నాసర్ అహ్మద్, అబ్రార్, రహీమొద్దిన్, హాసీఫ్, రిజ్వాన్, ముజాహిద్ పాల్గొన్నారు.

ఆదివాసీలకు ఇవ్వాలి

నార్నూర్: కుమురం భీం (ఆసిఫాబాద్) జిల్లా నియోజకవర్గం అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థిగా ఆది వాసీలనే ప్రకటించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొట్నాక్ నానాజీ, జిల్లా ఎస్టీ సెల్ వైస్ చైర్మన్ మెస్రం మోతీరాంలు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని మాన్కాపూర్‌లో మాట్లాడారు. ఇతర పార్టీల నుంచి వచ్చే వారికి టికెట్ కేటాయిస్తే ఊరుకోమన్నారు. సమావేశంలో నాయకు లు చిత్రం భీంరావు, మెస్రం బాదిరావు, మెస్రం ఇందర్శన్, కుంరం సెడ్మారావు పాల్గొన్నారు.

రీ డిజైన్ చేస్తేనే మేలు



చిక్‌మాన్ ప్రాజెక్టులోని నీటినిల్వ

- చిక్‌మాన్ ప్రాజెక్టు ఎత్తు పెంచాలని కోరుతున్న రైతులు
- వృథాగా వరద నీరు
- ఎడమ కాలువకు మరమ్మతులు కరువు

సిరికొండ: ఉంటే అతివృష్టి.. లేదంటే అనావృష్టి అన్న చందంగా మారింది రైతుల పరిస్థితి. మండలంలో ఉన్న ఒకేఒక సాగు నీటి వనరు చిక్‌మాన్ ప్రాజెక్టు. దీనిపై ఆధారపడి రైతులు పంటలు పండిస్తున్నారు. రాంపూర్, సిరికొండ సరిహద్దుల్లో గల చిక్‌మాన్ వాగుపై అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మించింది. నీటి సామర్థ్యం 0.144 టీఎంసీలు కాగా.. ఎత్తు 381 మీటర్లు, మూడు ఎకరాల్లో ఉన్న ఈ ప్రాజెక్టు ద్వారా 3200 ఎకరాల ఆయకట్టుకు మాత్రమే సాగునీరు అందుతోంది. వ్యవసాయాధికారుల లెక్కల ప్రకారం.. మండల వ్యాప్తంగా సుమారుగా 20 వేల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. ప్రాజెక్టు ఎత్తు పెంచితే పూర్తిస్థాయిలో సాగు నీరు అందుతుందని రైతులు కోరుతున్నారు.



పిచ్చి మొక్కలతో నిండిన ఎడమ కాలువ

వరద నీరు వృథా..

చిక్‌మాన్ వాగు పరీవాహక ప్రాంతం మండల వ్యాప్తంగా ఉంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం కేవలం 0.144 టీఎంసీలే కాబట్టి మిగతా వరద నీరు మొత్తం వృథాగా దిగువకు పోతుంది. లోతట్టు ప్రాంతంలోని పంట పొలాలు నీట మునుగుతున్నాయి. వర్షాకాలంలో నీరు వృథాగా పోతూ.. రబీ సమయం వచ్చే సరికి సాగు నీరు సరిపోక రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పంటలను కాపాడుకోవడం కోసం బావులు, బోర్లు వేయిస్తున్నారు.

ఎత్తు పెంచితే సాగు విస్తీర్ణం పెరుగుతుంది

కేవలం వర్షధారంపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారు రైతులు. దీంతో ఏడాదిలో ఒక్క పంటను మాత్రమే సాగు చేస్తున్నారు. చిక్‌మాన్ ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం తక్కువగా ఉండడంతో రాంపూర్, సిరికొండ గ్రామాల రైతులు, కాల్వకు సమీపంలో ఉన్న రైతులు మాత్రమే ప్రాజెక్టు నీటితో వ్యవసాయం చేస్తున్నారు. ప్రాజెక్టు ఎత్తు పెంచి, వృథాగా పోతున్న వరద నీటిని నిల్వ చేసి, పంటలకు సాగు నీరు అందించాలని రైతులు కోరుతున్నారు.

ప్రాజెక్టు ఎత్తు పెంచాలి



వ్యవసాయం వర్షంపై ఆధారపడి చేస్తున్నాం. సమయానికి వర్షాలు కురవక దిగుబడి రావడం లేదు. రబీలో పంటలు పండించుకుందాం అంటే సాగునీరు సరిపోవడం లేదు. చిక్‌మాన్ ప్రాజెక్టు ఎత్తు పెంచి, కాలువలు నిర్మించాలి.

– లస్మన్న, రైతు, సాత్‌మోరి

మరమ్మతులు చేయాలి



ప్రాజెక్టుకు నిర్మించిన కాలువలకు మరమ్మతులు చేయాలి. కాలువలో మట్టి, తుంగ పేరుకుపోవడంతో చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందడం లేదు. కాలువల్లో పూడిక తీయాలి.

– బత్తిని రాములు, రైతు, సిరికొండ

ప్రభుత్వం చొరవ తీసుకోవాలి

సిరికొండ మండలంలో అధికంగా గిరిజన రైతులే ఉన్నారు. వీరికి ఎలాంటి నీటి వసతులు లేవు. ప్రభుత్వం చొరవ తీసుకోని చిక్‌మాన్ ప్రాజెక్టును రీ డిజైన్ చేయాలి. ప్రభుత్వంపై ఇక్కడి ప్రజాప్రతినిధులు ఒత్తిడి తీసుకురావాలి.

– పెందుర్ అమృత్‌రావు, ఎంపీపీ, సిరికొండ

దివ్యాంగులకు అండగా ఉంటాం

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న



బీఆర్‌ఎస్‌లో చేరిన దివ్యాంగులతో ఎమ్మెల్యే

ఆదిలాబాద్‌టౌన్: దివ్యాంగులకు అండగా ఉండి అన్నివిధాలుగా ఆదుకుంటామని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఆదివారం ఆదిలాబాద్ పట్టణంలోని అర్నా గార్డెన్‌లో, తాటిగూడలో దివ్యాంగులతో పాటు పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గత ప్రభుత్వాలు దివ్యాంగులను విస్మరించాయని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పింఛన్ రూ.4016కు పెంచడం జరిగిందన్నారు. దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని, అన్నిరంగాల్లో కోటా ఉందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అజయ్, మహ్మద్ మున్న, సలీమ్, ఇమ్రాన్, మోబిన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్నను బీఆర్‌ఎస్ అభ్యర్థిగా మరోసారి టికెట్ దక్కడం పట్ల పద్మశాలి సంఘం నాయకులు ఎమ్మెల్యేను ఆదివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బాస మాధవ్, ఆశన్న, శ్రీనివాస్, లక్ష్మణ్, నగేశ్, రాజమణి, ప్రమిళ, శోభ, నరేశ్, సత్యనారాయణ, సంతోష్ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యాబోధన చేయాలి

ప్రభుత్వ కళాశాలల్లో చదివే పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేయాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఆదివారం ఆదిలాబాద్ పట్టణంలోని అంబేద్కర్ భవనంలో తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ 711 సంఘం ఆధ్వర్యంలో కృతజ్ఞత సభ నిర్వహించారు. కాంట్రాక్ట్ లెక్చరర్లను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేను శాలువతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీఐఈవో రవీందర్ కుమార్, డీసీసీబీ డైరెక్టర్ బాలూరి గోవర్ధన్ రెడ్డి, ప్రిన్సిపాల్ సంఘం అధ్యక్షుడు జాదవ్ గణేష్ కుమార్, కనక చంద్రం, ప్రేమ్ కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహాధర్నా విజయవంతం చేయండి

ఎదులాపురం: ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లోని గాంధీపార్క్ వద్ద నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని కమిటీ నాయకులు కొమ్ము రమేశ్, జాదవ్ వెంకట్‌రావు, అదిములం వెంకట్, భుజంగ్‌రావులు పిలుపునిచ్చారు. ప్రచారయాత్ర ఆదివారం జిల్లా కేంద్రానికి చేరుకుంది. అనంతరం డైట్ కళాశాలలో వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టినప్పటికీ ఎలాంటి స్పందన లేదన్నారు. కార్యక్రమంలో కమిటీ బాధ్యులు స్వామి, అశోక్, రమేశ్వర్, సుగుణ, రియాజ్, లక్ష్మణ్, సూర్యకుమార్, కిష్టన్న, శ్రీనివాస్, శివన్న, శంకర్, విలాస్, గణేశ్ పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద మహాధర్నా నిర్వహించడం జరుగుతుందని నాయకులు తెలిపారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆదివారం యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో ఉట్నూర్ ప్రెస్‌భవన్‌లో ధర్నా పోస్టర్ ఆవిష్కరించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాథోడ్ గణేశ్ మాట్లాడుతూ.. ఎన్ని ఆటంకాలు ఎదురైనా ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం సాగిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు వీరయ్య, సుగుణ, కుంర శ్రీనివాస్, విశ్వనాథ్, బలిరాం, వెంకటేశ్వర్లు, ప్రకాశ్, చిత్రు, దినేశ పాల్గొన్నారు.

మహనీయుల అడుగుజాడల్లో నడవాలి



కైలాస్‌నగర్: చైర్మన్‌ను సన్మానిస్తున్న నాయకులు



ఇంద్రవెల్లి: మాట్లాడుతున్న నాయకులు

కైలాస్‌నగర్: ప్రతిఒక్కరూ మహనీయుల అడుగుజాడల్లో నడవాలని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. పట్టణంలోని రణదీవేనగర్‌లో ఆదివారం నిర్వహించిన అన్నాభావుసాఠే జయంతి వేడుకలకు హాజరయ్యారు. అన్నాభావుసాఠే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాహిత్యరంగానికి ఆయన చేసిన సేవలు మరవలేనివన్నారు. నేటితరం అన్నాభావుసాఠేను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో నేతకానీ మహార్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుర్గం శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

జయంతిని విజయవంతం చేయండి

ఇంద్రవెల్లి: అన్నాభావుసాఠే జయంతిని విజయవంతం చేయాలని అన్నాభావుసాఠే ఉత్సవ కమిటీ మండల అధ్యక్షుడు కాంబ్లే బాలరాజ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. ఈనెల 28న మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు సమీపంలో ఉదయం 11 గంటలకు అన్నాభావుసాఠే వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలు, అన్నాభావుసాఠే కమిటీ నాయకులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో అన్నాభావుసాఠే అసోసియేషన్ మండల ప్రధాన కార్యదర్శి అందారే బాలాజీ, ఉపాధ్యక్షుడు రాందాస్, మోతివార్ సంబాజీ, గోవింద్, ప్రహ్లాద్, గంగాధర్, నాగరాజ్ పాల్గొన్నారు.

ఆదర్శంగా తీసుకోవాలి

నార్నూర్: అన్నాభావుసాఠేను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని సోనాపూర్ సర్పంచ్ సుజాత పరమేశ్వర్ అన్నారు. ఆదివారం మండలంలోని సోనాపూర్‌లో జయంతిని నిర్వహించారు. అన్నాభావు సాఠే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బడుగుబలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఎంతో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో కిరణ్, సూర్యవంశీ, పండరి, ప్రకాష్, అంబారావు, ఈశ్రు పాల్గొన్నారు.

సభకు తరలిన అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు

ఆదిలాబాద్‌టౌన్: అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ వరంగల్‌లో నిర్వహించిన సభకు జిల్లాకు చెందిన అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఆదివారం తరలివెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రతీ సంవత్సరం ఇంక్రిమెంట్ ఇవ్వడంతో పాటు ఉద్యోగి మరణిస్తే ఆ కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు స్వామి, బండ శ్రీనివాస్, రవి, దత్తు, ఆత్మరాం, సంతోష్, శైలేందర్ గౌడ్, తిరుపతి, పెంటన్న, సారయ్య పాల్గొన్నారు.

సమస్యలు తలెత్తకుండా చూడాలి

ఉట్నూర్‌రూరల్: గ్రామాల్లో సమస్యలు తలెత్తకుండా చూడాలని ఎంపీపీ జైవంత్‌రావు అన్నారు. ఆదివారం ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో సమావేశం నిర్వహించారు. ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలని సూచించారు. కోఆప్షన్ సభ్యుడు రషీద్, ఎంపీటీసీలు, సరచ్‌లు బలిరాం, భీంరావు, అనసూయ, లచ్చు పటేల్, జుగాదిరావు, శాయంరావు, నందకుమార్, సీతారాం, అంకవ్వ, కళావతి, దేవ్‌రావు పాల్గొన్నారు.

సంక్షిప్తం..

కాంగ్రెస్ పార్లమెంట్ ఇన్‌చార్జిని కలిసిన చౌహాన్ శ్రీనివాస్

నార్నూర్: కర్ణాటక కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ఆదిలాబాద్ జిల్లా పార్లమెంట్ ఇన్‌చార్జి ప్రకాష్ రాథోడ్‌ను ఆదివారం సామాజిక కార్యకర్త చౌహాన్ శ్రీనివాస్ ఆదివారం మర్యదపూర్వకంగా కలిశారు. ఆసిఫాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గత కొన్ని ఏళ్లుగా సామాజిక సేవ కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట కుమురం భీం జిల్లా డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, తదితరులు ఉన్నారు.

ముదిరాజ్ కార్యవర్గం ఎన్నిక

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ పట్టణ ముదిరాజ్ కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. పట్టణంలోని సంఘ భవనంలో నిర్వహించిన ఎన్నికల్లో గత కొన్ని రోజులుగా అభ్యర్థులు పోటా పోటీగా ప్రచారం నిర్వహించారు. అధ్యక్షుడిగా ధరవేణి రాము, ప్రధాన కార్యదర్శిగా దర్శ రవి, కోశాధికారిగా బొజ్జ సంతోష్ ఎన్నికయ్యారు. సభ్యులను ముదిరాజ్ కులస్తులు సన్మానించి, అభినందనలు తెలిపారు.

పరామర్శ

ఆదిలాబాద్‌టౌన్: కత్తి దాడిలో గాయపడిన హమాలీ యూనియన్ ప్రధాన కార్యదర్శి కుమారుడు గజానంద్‌ను ఏఐటీయూసీ నాయకులు పరామర్శించారు. రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయనను ఆదివారం పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్, సిర్ర దేవేందర్, రాజేందర్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో మాజీ సర్పంచ్ భర్త మృతి

ఇచ్చోడ: మండల కేంద్రంలో మెజార్ పంచాయతీ మాజీ సర్పంచ్ చౌహాన్ ప్రమీళ భర్త రమేశ్ శనివారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన అంత్యక్రియల్లో ఆదిలాబాద్ మాజీ ఎంపీ గోడం నగేశ్, బోథ్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నేరడిగొండ జెడ్పీటీసీ అనిల్‌జాదవ్, ఇచ్చోడ ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, ఉపసర్పంచ్ లోక శిరిష్‌రెడ్డి, కాంగ్రెస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

భరంపూర్‌ను మండలంగా ఏర్పాటు చేయాలి

తలమడుగు: భరంపూర్‌ను మండలం ఏర్పాటు చేయాలని మండల సాధన సమితి ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించారు. మండలం ఏర్పడితే ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన ఉద్యోగులకు ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. పాలన ప్రజలకు అందుబాటులోకి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బరంపురం మండల సాధన సమితి కన్వీనర్ బొల్లారం బాబన్న, వెంకట్‌రెడ్డి, కళాకారులు ఎడ్ల ఆశన్న, పెద్ద అశోక్, ముక్కెర దత్తు, చిన్న అశోక్, తదితరులు పాల్గొన్నారు.

బీజేవైఎం జిల్లా కార్యదర్శిగా అరవింద్

బోథ్: బీజేవైఎం జిల్లా కార్యదర్శిగా మండలంలోని సూర్యనగర్ గ్రామానికి చెందిన జాదవ్ అరవింద్‌ను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ ఆదివారం నియమాక పత్రం అందుకున్నారు. పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు.

ఆలయ అభివృద్ధికి ప్రత్యేక కృషి

- బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు

తలమడుగు: నారాయణ బాబా ఆలయం అభివృద్ధికి కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. ఆదివారం మండలంలోని పల్సి(బి)తండా గ్రామంలో నారాయణ బాబా ఆలయ ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆలయంలోని సమస్యలను దశలవారీగా పరిష్కరించడం జరిగిందన్నారు.

పరామర్శ..

పల్సి(బి)తండా గ్రామానికి చెందిన ఫకీరా జాదవ్ భార్య ఇటీవల మృతి చెందింది. దీంతో కుటుంబసభ్యులను బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు పరామర్శించారు. తలమడుగు మండల కేంద్రనికి చెందిన ఎంపీటీసీ చంటి మాతృమూర్తి మృదిచెందడంతో ఆయనను పరామర్శించారు. బోథ్ అధికార ప్రతినిధి మొట్టే కిరణ్ కుమార్, మండల కన్వీనర్ వెంకటేశ్, సర్పంచ్ జీవన్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, అబ్దుల్లా, గంగాధర్ పాల్గొన్నారు.



ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

200లకు పైగా నామినేషన్లు వేస్తాం

- ఎన్నికల ముందు బోథ్‌ను డివిజన్‌గా ప్రకటించాలి..
- సమావేశానికి భారీగా హాజరైన ప్రజలు
- ఆమరణ దీక్షలు చేస్తామంటున్న సాధన సమితి సభ్యులు

బోథ్: ఎన్నికలలోపు బోథ్‌ను డివిజన్ చేయకుంటే రెండు వందలకు పైగా వ్యక్తులతో అసెంబ్లీ ఎన్నికల్లో నామినేషన్లు వేస్తామని బోథ్ డివిజన్ సాధన సమితి సభ్యులు స్పష్టం చేశారు. ఆమరణ దీక్షలకు కూడా కూర్చుంటామని వారు పేర్కొన్నారు. డివిజన్ కోసం ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేయడానికి మండల కేంద్రంలోని షాదీఖానాలో ఆయా గ్రామాల ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతీ గ్రామంలో విద్యార్థులు, గ్రామస్తులతో కలిసి ర్యాలీల నిర్వహణ, జాతీయ రహదారి 44పై త్వరలోనే నిరసన కార్యక్రమం చేపట్టడం, హైదరాబాద్‌లోని ధర్నాచౌక్‌లో ధర్నా వంటివి నిర్ణయించారు. 43 రోజులుగా చేస్తున్న దీక్షలు కొనసాగుతాయని పేర్కొన్నారు. రేపటి నుంచి ఉద్యమం తీవ్రతరం చేయనున్నట్లు వారు ప్రకటించారు.



మాట్లాడుతున్న చిలుక దేవిదాస్, నాయకులు

కొనసాగుతున్న డివిజన్ దీక్షలు

బోథ్: బోథ్‌ను డివిజన్‌గా చేయాలని చేస్తున్న దీక్షలు కొనసాగుతున్నాయి. ఆదివారానికి 43వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో ఫ్రెండ్స్ యూత్ సభ్యులు కూర్చున్నారు. వీరికి పలువురు నాయకులు, ప్రజా ప్రతినిధులు, సంఘీభావం ప్రకటించారు.

ఉద్యమానికి సంపూర్ణ మద్దతు

బోథ్ ప్రజలు చేపడుతున్న అస్థిత్వ పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని ఆల్ ఇండియా కిసాన్ సభ జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుక దేవిదాస్ అన్నారు. ఆదివారం దీక్షా శిబిరాన్ని సందర్శించారు. ఆయన వెంట భోజన్న ఉన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

ఇచ్చోడ: 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ తుకారాం అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో ఓటరు నమోదు ప్రత్యేక క్యాంపెనింగ్ నిర్వహించారు. యువతీ, యువకులు తప్పనిసరి ఓటుహక్కు కలిగి ఉండాలన్నారు. బీఎల్‌వోల వద్ద ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ జాదవ్ రామారావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు నమోదు పరిశీలన

బేల: మండలంలోని తోయగూడ, ఖార, డౌన, సాంగ్వి(జి) గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లలో ఆదివారం ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ వేణుగోపాల్ ఓటరు నమోదును పరిశీలించారు. మార్పులు చేర్పుల కోసం వచ్చిన దరఖాస్తులపై బూత్‌లెవల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నారాయణ ఉన్నారు.

ఓటు వజ్రాయుధం లాంటిది

నేరడిగొండ: ఓటు వజ్రాయుధం లాంటిదని, అర్హులైన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ సంతోష్ రెడ్డి అన్నారు. ఆదివారం ఇచ్చోడ మండలం కోకస్‌మన్నూర్ గ్రామం మీదుగా మండలంలోని గాజిలి, తర్నం(బి), వాగ్దారి, వెంకటాపూర్, మాధాపూర్, కుంటా(కె) గ్రామాలను సందర్శించి అవగాహన కల్పించారు. గాజిలి గ్రామానికి వెళ్లే మార్గంలో వాగు ఉండడం, ఎడ్లబండిపై గ్రామానికి చేరుకున్నారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటుహక్కు కలిగి ఉండాలని సూచించారు. ఆయన వెంట ఆర్‌ఐ నాగోరావు, సిబ్బంది ఉన్నారు.



బేల: ఓటరు నమోదుపై ఆరా తీస్తున్న తహసీల్దార్

తలమడుగు: మండలంలోని బరంపూర్, తలమడుగు, కజ్జర్ల, రుయ్యాడి గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను తహసీల్దార్ రాజ్‌మోహన్ పరిశీలించారు. బీఎల్‌వోలు ప్రజలకు అందుబాటులో ఉండి, ఓటర్ మార్పులు, చేర్పులు చేయాలన్నారు. సర్పంచ్‌లు పోతరెడ్డి, వెంకటమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.



ఇచ్చోడ: మాట్లాడుతున్న తహసీల్దార్ తుకారాం

నార్నూర్: గాదిగూడ, నార్నూర్ మండలాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆదివారం కుమురంభీం డీఆర్‌వో సురేశ్ పరిశీలించారు. సౌకర్యాలు, సమస్యలను స్థానిక తహసీల్దార్లను అడిగి తెలుసుకున్నారు. నార్నూర్ మండలంలోని తాడిహత్నూర్ 13, 14, 15, 16, నార్నూర్‌లోని 1, 4, మహాగావ్‌లోని 18 పోలింగ్ కేంద్రాలు, గాదిగూడ మండలంలోని ఖడ్కీ, లోకారి(కె), అండ్‌గూడ, పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్లు రాజలింగం, విజయనందం, డీటీలు అమృత్‌లాల్, యాదవ్‌రావు, కవితచ నీల, శకుంతల ఉన్నారు.

సీఈఐఆర్ పోర్టల్‌ద్వారా ఫోన్‌ల రికవరీ



బాధితుడికి ఫోన్ అప్పగిస్తున్న సీఐ

ఆదిలాబాద్‌టౌన్: పోగొట్టుకున్న, చోరీకి గురైన ఫోన్‌లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి బాధితులకు అప్పగించడం జరుగుతుందని టూటౌన్ సీఐ అశోక్ అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని సంజయ్‌నగర్‌కు చెందిన గట్కు లక్ష్మణ్ తన బైక్‌పై కలెక్టర్ క్యాంప్ కార్యాలయం వైపు వెళ్తుండగా ఇటీవల ఫోన్ పడిపోయింది. దీంతో ఆయన టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఆదివారం బాధితుడికి ఫోన్ అప్పగించారు. ఫోన్ పోగొట్టుకున్న, చోరీకి గురైనా వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది నరేశ్, ప్రవీణ్ పాల్గొన్నారు.